# సరైన దారి

**— రసరాజు**

**రైలు బ్రిడ్జిమీద కొచ్చిందో లేదో ప్రయాణీకుల్లో కోలాహలం మొదలయింది.**

అందరి కళ్ళూ ఆ గోదారి పైనే—

ఎటు చూసినా పుష్కరాల సందడి...

గోదావరికి బదులు జనమే ప్రవహిస్తున్నట్లుగా వుంది.

గోదావరిలోకి డబ్బులు విసిరే ప్రయాణీకులు కొంతమంది—

కాయలూ, పళ్ళూ వేసేవాళ్ళు మరికొంతమంది—

అదీ ఇదీకాక— రెండు చేతులూ జోడించి ఓ 'నమస్కారం అర్పించేవాళ్ళు మరి కొంతమంది—

ఇలా వుంది పరిస్థితి...

ఆ బండిలో— చివరి పెట్టెలో— సిద్ధాంతీ, ఆయన భార్య శ్రీమహాలక్ష్మి కూర్చున్నారు.

ఆ ఇద్దరికీ మధ్య పతంజలి—

పతంజలి లేకలేక పుట్టిన పిల్లాడు.

పన్నెండేళ్ళుంటాయి.

మామూలు చదువుతోపాటు— మధ్య మధ్య వేదం కూడ వల్లిస్తున్నాడు.

"బాబూ... ఈ పైసలు గోదావరిలో వేసి దండం పెట్టుకో..." సిద్ధాంతి పతంజలి చేతిలో పది పైసల బిళ్ళ పెట్టాడు.

శ్రీమహాలక్ష్మి కూడా కొంత చిల్లర పతంజలి చేతికిచ్చి— మధ్య మధ్యలో గోదారి తల్లి కడుపులో వేసి నమస్కారం చేసుకోమంది.

రైలు—బ్రిడ్జి దాటి గోదావరి స్టేషన్లోకొచ్చి ఆగింది...

ముగ్గురూ బండి దిగి పుష్కరాల రేవుకు బయలుదేరారు. దారి పొడుగునా బిచ్చగాళ్ళు...

"అమ్మా... బాబూ..." దీనంగా అర్థిస్తున్నారు.

అందులో కొంతమంది మరీ దయనీయంగా వున్నారు.

మరి కొంతమంది—పనీపాటా చేసికొనే స్థితిలో వుండికూడ అడుక్కొంటున్నారు.

సిద్ధాంతీ, శ్రీమహాలక్ష్మి అవేమీ పట్టించుకోవటం లేదు.

నడుస్తూ నడుస్తూ పతంజలి ఓచోట ఆగిపోయాడు...

అక్కడో ముసిల్ది—

ఏడు పదుల వయస్సు దాటే వుంటుంది.

రెండు కళ్ళనిండా పుసులు...

వడిలి వత్తయిపోయిన శరీరం...



గొంతు తెరచి ఏ మాత్రం అర్థించలేని పరిస్థితి...

పతంజలి పసిహృదయం ఒక్కసారిగా బావురుమంది.

జేబులోంచి పావలా తీసి ఆమె గిన్నెలో వేశాడు.

సిద్ధాంతీ, శ్రీమహాలక్ష్మి గమనించారు కాని, పతంజలిని ఏమీ ప్రశ్నించలేదు.

పతంజలి మరి కొంతదూరం నడిచాడు—

అక్కడ మళ్ళీ మరో వికృతాకారం...

ఒంటినిండా పుళ్ళు...

ఈగలు...

దుర్గంధం...

ముక్కూ మొగం కలిసిపోయిన మోడులాటి జీవితం...

పతంజలి గుండె కరిగి గోదారయింది.

జేబులోంచి రెండు పది పైసల బిళ్ళలు తీసి— ఆ వికృతాకారం ముందు పడేశాడు.

సిద్ధాంతి, శ్రీమహాలక్ష్మి మళ్ళీ గమనించారు.

"ఎక్కడివిరా డబ్బులు?..." తల్లి అడిగింది.

పతంజలి మాట్లాడలేదు.

పది గజాలు సాగేక దంపతులిద్దరూ వెనక్కి చూశారు.

పతంజలి మళ్ళీ ఓచోట ఆగిపోయి జేబులోంచి చిల్లరంతా బయటికి తీస్తున్నాడు.

అక్కడ—

రెండు కళ్ళూ, కాళ్ళూ లేని ముసిలాడు కనిపించాడు.

పతంజలి ఆ మిగిలిన చిల్లరంతా ఆ ముసిలాడి చేతిలో పడేశాడు.

"ఇదేవిట్రా!... ఎక్కడివీ డబ్బులు?..." సిద్ధాంతి మందలింపు ధోరణిలో ప్రశ్నించాడు.

"ఇందాక— గోదార్లో పడేయమని అమ్మా, మీరూ ఇవ్వలేదూ... అవి!..." పతంజలి బదులు చెప్పాడు.

"ఇందాక గోదావరిలో వేసేశావు కదరా..."

"లేదు... చెయ్యి పైకెత్తి గోదావరిలో విసిరినట్లుగా నటించా..."

"ఓరి భడవా!... ఎంత పని చేశావురా..."

"గోదారితల్లి మెచ్చుకొనే పనే చేశాను..."

"ఇలాగా చేయటం..."

"మరి— మొన్న అవేవో పుష్కరాల్లో అమ్మ మొక్కుకుందని నాచేత ఎన్ని డబ్బులో గంగలో పోయించారు.. ఆ తరువాత అక్కడున్న ముష్టోళ్ళి చూశా... అయ్యో పాపం అనిపించింది..."

"గొప్ప ఫనే చేశావ్..."

"నాన్నగారూ! మరి మీరు భాగవతంలో 'కలదందురు దీనుల యెడ'' అని చదివారు కదా..."

సిద్ధాంతి— ఆ మాటతో ఇరుకున పడ్డాడు.

"మరి— మానవసేవే మాధవ సేవని అమ్మ పదే పదే చెబుతుందిగా..."

శ్రీమహాలక్ష్మి నోరు విప్పలేదు.

"అందరికీ దానం చేయకూడదు, తగినవాళ్ళకే చెయ్యాలి అని మీరు ఆ మధ్య ఆంజనేయస్వామి కోవెలలో ఉపన్యాసం చెప్పారు కదా నాన్నగారూ..."

"... ..."

"గోదావరి తల్లి పైసలేం చేసుకొంటుంది నాన్నగారూ... భక్తితో రెండు చేతులూ జోడిస్తే చాలదూ...

అందుకే గోదారి తల్లికి గుండెనిండా దండం పెట్టుకొని పైసలు మాత్రం ముష్టోళ్ళ కేసేశాను.. తప్పు చేశానా నాన్నగారూ..."

సిద్ధాంతికీ, శ్రీమహాలక్ష్మికీ— ఏం మాట్లాడాలో తెలిసింది కాదు.

"ఏవండీ! వాడు తప్పిపోతాడేమో... ముందు నడుస్తున్నాడు వేగంగా..."

శ్రీమహాలక్ష్మి ఆదుర్దా పడింది.

"తప్పిపోయేది వాడు కాదే! మనం.. వాడు సరైన దారిలోనే నడుస్తున్నాడు పద— మనం అటే వెడదాం"

సిద్ధాంతి, శ్రీమహాలక్ష్మి చేతిని పట్టుకొని పతంజలి వెనకాలే నడిచాడు. ●